# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారతదేశ ఆర్థిక వృద్ధి గొప్ప శిఖరాలకు చేరుకుంటోందన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.**

2. **ఏలూరు జిల్లాలో నిర్వహిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.**

3. **దిత్వా తుఫాను దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్న హోంమంత్రి వి. అనిత.**

4. **ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు తెనాలి నుంచి ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తున్నామన్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.**

5. **రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ.**

==========================

ఢిల్లీలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభమైయ్యాయి. ఈ సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాత్రికేయులతో మాట్లాడుతూ, భారతదేశ ఆర్థిక వృద్ధి గొప్ప శిఖరాలకు చేరుకుంటోందని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో భారతదేశ అభివృద్ధికి సంబంధించిన చర్చలు జరగాలని ఆకాంక్షించారు. దేశ నిర్మాణానికి సానుకూల మనస్తత్వం అవసరమని అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు ప్రజాస్వామ్యం దోహదపడగలదని భారతదేశం నిరూపించిందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 21 సెకన్లు

-------------------------

ఏలూరు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని గొల్లగూడెం గ్రామంలో ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం అక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబునాయుడు పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేస్తారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈరోజు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఏలూరు, విజయనగరం, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక శాసనసభ్యులు, అధికారులు లబ్దిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా శివపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్... 31 సెకన్లు

---

దిత్వా తుఫాను దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని హోంమంత్రి వి. అనిత తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌తో కలిసి లబ్ధిదారులకు ఫింఛన్ నగదును పంపిణీ చేశారు. అనంతరం రామలింగేశ్వరనగర్‌లో రిటైనింగ్ వాల్‌కు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు సంక్షేమాకి ప్రాధ్యాన్యత ఇస్తున్నామన్నారు. దిత్వా తుఫాను ప్రభావిత జిల్లాలలో విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైం గవర్నెన్స్- ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి తుఫాను వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం సమర్ధవంతంగా ఎదుర్కొంటుందని మంత్రి వివరించారు.

---

రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని తెనాలి నుంచి ఎగుమతి చేసేందుకు 21 వ్యాగన్లతో కూడిన ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండల పరిధిలోని అత్తోట, చివలూరు, దావులూరు గ్రామాల్లో ఆయన నిన్న పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులందరి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. గోనె సంచులను, టార్పాలిన్లు ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 11 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని 2 వేల 600 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వెల్లడించారు.

---

"దిత్వా" తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కల్లాల్లో ఎక్కడికక్కడ ధాన్యం ఉండటంతో రైతులకు ఉపయోగపడేలా ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పడం వంటివి చేపట్టాలని ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తగినంత మంది సిబ్బందిని నియమించడం, త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం, గోదాముల్లో నిల్వ చేయడం వంటివి చేయాలని మంత్రి సూచించారు.

---

ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో ఈరోజు  అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల నుండి ప్రారంభమై టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో ఈ.బి.దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా

ఆమె మాట్లాడుతూ ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. తిరుపతిజిల్లా ఏర్పేడులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-ఐఐటిలో జరిగిన ఇండియన్ లీన్ కన్ స్ట్రక్షన్-2025 సదస్సులో ముఖ్య అతిథిగా మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రోత్సహకాలతో రాష్ట్రానికి  త్వరలో నూతన పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

---------------------------

విశాఖపట్టణాన్ని పర్యాటక రాజధానిగా అభివృద్ధి చేస్తున్నామని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ అన్నారు. విశాఖనగరంలోని కైలాసగిరిపై 7 కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన గ్లాస్ వంతెనను నగర మేయర్ పీలా శ్రీనివాసరావుతో  కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు.  ఈ సందర్భంగా శ్రీభరత్  మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా తట్టుకునేలా గ్లాస్ వంతెనను రూపొందించామన్నారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ వంతెన నుంచి ఒకేసారి 40 మంది పర్యాటకులు విశాఖపట్నం నగరంతో పాటు ప్రకృతి అందాలు వీక్షించవచ్చని తెలిపారు.

---------------------------

ప్రాణాలను లెక్కచేయకుండా దేశ సరిహద్దులను కాపాడుతున్న సరిహద్దు భద్రతాదళం.. బీఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈరోజు జరుపుకొంటున్నాం. 1965లో భారత్-పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా అదే ఏడాది డిసెంబర్ 1వ తేదీన సరిహద్దు భద్రతాదళం ఆవిర్భవించింది. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనికులు కనబరుస్తున్న ధైర్యసాహసాలను గుర్తు చేసుకుంటూ.. దేశవ్యాప్తంగా ఈరోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

తమిళనాడు, పుదుచ్చేరి తీరం వెంట ఉత్తరం దిశగా కదులుతున్న దిత్వా తుపాను  నిన్న సాయంత్రం తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని, ఈరోజు ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి ఎస్.స్టెల్లా తెలియజేస్తూ,

వాయిస్ .. 27 సెకన్లు

=====================